క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యేకు నివాళి



గద్వాల: మాజీ ఎమ్మెల్యే ఉప్పల గోపాల్‌రెడ్డి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తుల్జారాం దేవాలయం ఎదురుగా ఉన్న ఉప్పల గోపాలరెడ్డి విగ్రహానికి శ్రేయభిలాషులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వైండింగ్ రాములు, ప్రభాకర్‌రెడ్డి, సిద్దార్థరెడ్డి, రామకృష్ణరెడ్డి, మోహిన్, ప్రభాకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, కిఫాత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం కోసం స్థలం కేటాయింపు

గట్టు: మండల కేంద్రంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు కోసం అధికారులు స్థలాన్ని పరిశీలించి దీనికి సంబంధించిన పత్రాలను శుక్రవారం తహసీల్దార్ జుబేర్ రహిముద్దీన్ పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావుకు అందజేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట, పల్లెప్రకృతి వనం పక్కనే ఉన్న సర్వే నెంబర్ 14లో ఉన్న 0.25 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. మండలంలోని చాలా చోట్ల క్రీడా ప్రాంగణం పనులు పూర్తిగా కాగా గట్టులో స్థల వివాదం కారణంగా వాయిదా పడింది. ఎట్టకేలకు స్థలాన్ని కేటాయించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గిర్దావర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండకుండా చూడాలి

మల్దకల్: హరితహారంలో నాటిన మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ కృష్ణయ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని నాగర్‌దొడ్డి, తాటికుంట, మల్దకల్ గ్రామాల్లోని రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు నర్సరీలలో మొక్కలను పెంచి హరితహారం నాటికి సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ స్వామి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన



గద్వాల అర్బన్: వేతన సవరణ కోసం విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు చేపట్టిన నిరసన శుక్రవారం కొనసాగింది. భోజన విరామ సమయంలో డివిజినల్ ఇంజనీర్ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ రామకృష్ణ, కో చైర్మన్ అశోక్, కన్వీనర్ శ్రీనివాస్, యుగేందర్, నర్సింహ్మా, వెంకట్రాములు, సుప్రియ, విమల తదితరులు ఉన్నారు.

పరిసరాల శుభ్రతే ముఖ్యం



ఆత్మకూర్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంఈఓ భాస్కర్‌సింగ్, సర్పంచ్ సుజాత అన్నారు. శుక్రవారం మండలంలోని గుంటిపల్లి గ్రామంలో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయాశాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది 11 టీంలుగా ఏర్పడి ఒక్కో టీం 20 కుటుంబాలకు మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంవద్ద మ్యాప్ ఏర్పాటుచేసి గ్రామంలో తడి, పొడిచెత్త, ఆరోగ్యం, ఇతర విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డి, కార్యదర్శి సుచిత్ర, ట్రెయినింగ్ కోఆర్డినేటర్లు రాజు, కుర్మయ్య, రఘు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

కరాటేలో విద్యార్థిని ప్రతిభ

పెబ్బేరు: హైదరాబాద్ ఎల్బీనగర్‌లో విక్టరీ షోటకాన్ కరాటే పోటీలలో బ్రిలియంట్ స్కూల్ విద్యార్థిని గుర్రం జోషిక ప్రతిభ చాటారని శుక్రవారం మాస్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా విక్టరీ షోటోకాన్ కరాటే పోటీలలో బ్లాక్ బెల్ట్ సాధించింది. అలాగే హీరో సుమన్ బ్లాక్ బెల్ట్, సర్టిఫికెట్స్ అందజేశారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.



ఎర్రవల్లి చౌరస్తాలో నిరసన తెలుపుతున్న నాయకులు, మహిళలు



రాజోలిలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కేంద్ర ప్రభుత్వంపై కన్నెర్ర

- సిలిండర్ ధర పెంపుపై నిరసన
- బీఆర్‌ఎస్ నాయకుల వంటా వార్పు

అలంపూర్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్యుడి బతుకు భారంగా మారిందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. శుక్రవారం పట్టణంలోని గాంధీ చౌక్‌లో బీఆర్‌ఎస్ నాయకులు గ్యాస్ ధరల పెంపుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో వంటావార్పుతో ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శేఖర్ రెడ్డి, నాయకులు సుదర్శన్ గౌడ్, నారాయణ రెడ్డి, వెంకట్రామయ్య శెట్టి, బీచుపల్లి, నర్సన్ గౌడ్, దేవరాజు, జాన్, అల్లబఖష్, శేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గాంధీ చౌక్ చౌరస్తాలో గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా వంటావార్పు చేసి నిరసన తెలిపారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట్రాములు, దామోదర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, రాజశేఖర్‌రావు, శేషిరెడ్డి, శంకర్‌గౌడ్, హుసేన్, ప్రభాకర్, సర్పంచ్ శ్రీనివాసులు, నరసింహులు, ఎంపీటీసీ స్వాములు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజోలి: గ్యాస్ ధరల పెంపుపై బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరామ్‌రెడ్డి, గంగిరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, భూషణం, తిరుమల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ శుక్రవారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేశ్వరెడ్డి, గుమ్మ గోవర్ధన్, నీలి శ్రీనివాసులు, వేణుగోపాల్ నాయుడు, కృష్ణ, రాఘన్న, లక్ష్మన్న, ఈదన్న, రాముడు, లోకారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు ఉన్నారు.

శాంతినగర్: పెంచిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ పట్టణ కేంద్రంలో శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

సీపీఎం ఆధ్వర్యంలో..

గట్టు: పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. బస్టాండ్ ఆవరణలో వంటావార్పు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు వీవీ నర్సింహా మాట్లాడుతూ 2014లో సిలిండర్ ధర రూ.440 ఉందని ప్రస్తుతం రూ.1195లకు చేరుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నర్మద, మండల కార్యదర్శి ఆంజనేయులు, ప్రభుదాసు, లక్ష్మన్న, జయన్న, లక్ష్మి, సరస్వతి, తిమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలో సీఐటీయూ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం సిలిండర్ ధర పెంపుపై నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, అశోక్, నాగరాజు, హమాలీ వెంకట్రాముడు, జానీ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



మానవపాడులో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



అలంపూర్‌లో..



గట్టులో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు



ఉండవెల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో..

సైన్స్‌తోనే మానవ మనుగడ



గట్టు: సైన్స్‌తోనే మానవ మనుగడ సాధ్యమని జెడ్పీటీసీ బాసు శ్యామల అన్నారు. శుక్రవారం మాచర్ల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జెడ్పీటీసీ, హెడ్మాస్టర్ నర్సింహులు బహుమతులు అందజేశారు. క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు



మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వారం రోజుల కిందట 1997–98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ. 50 వేలు సమకూర్చి సరస్వతి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పుట్టినరోజు జరుపుకున్న పలువురు విద్యార్థులు సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మన్న పాల్గొన్నారు.

నేడు ఇంటర్ విద్యార్థులకు ఎన్విరాన్‌మెంట్ టెస్ట్

మానవపాడు: మండల కేంద్రంలోని గంగు వెంకట కృష్ణారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2022–23 సంవత్సరానికి సంబంధించి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. 4 వ తేదీ నైతికత మానవ విలువలు, 6వ తేదీ పర్యావరణ విద్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 1 గంటల వరకు సమయం ఉంటుందని పేర్కొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



ర్యాలీలో పాల్గొన్న సీడీపీఓ

మల్దకల్: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీఓ కమలాదేవి సూచించారు. శుక్రవారం మల్దకల్ ప్రాజెక్టు కార్యాలయంలో మల్దకల్, గట్టు, అయిజ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అంతకు ముందు అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగరాణి, బాలమ్మ, యామిని, వాసంతి, తెల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పశు సంపదను కాపాడుకుందాం

శాంతినగర్: పశు సంపదను కాపాడుకుందామని ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం అన్నారు. వడ్డేపల్లి మండలంలోని ఆర్డీఎస్ కెనాల్ సమీపంలో వెలసిన భ్రమరాంబసమేత మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలలో భాగంగా పశు బలప్రదర్శన పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభిచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా సాగుతుందన్నారు. ఒంగోలు జాతి పశు పోషకులను అభినందించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచా ఒంగోలు కోడెలు బండలాగుడు పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, అజయ్ అన్న సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం

ఘనంగా శిఖర కలశ ప్రతిష్ఠోత్సవం

రాజోలి: మండల కేంద్రంలోని అంబాభవానీ గోపుర శిఖర కలశ కుంభాషేక ప్రతిష్ఠాపనను శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని, ఆలయాన్ని అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అబ్రహం హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబాభవానీ కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అజయ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు అండ

అలంపూర్: సీఎం సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అయిజ మండలం చిన్న తాండ్రపాడు గ్రామానికి చెందిన ప్రభు సీఎం సహాయ నిధి రూ. 2 లక్షల మంజూరయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం బాధిత కుటుంబసభ్యులకు అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఎల్‌ఓసీ చెక్కును అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, బాలు తదితరులు ఉన్నారు.

గద్వాల రూరల్: పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగంగా ఉందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో గట్టు మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపీపీలు ప్రతాప్‌గౌడ్, విజయ్, హనుమంతు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

గట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా మన్సూర్ పాషా, డీఈఓగా గణేష్, ఎంఈఓగా భీమేష్, హెచ్‌ఎంగా రాకేష్, ఉపాధ్యాయులుగా చరణ్, గౌతమి, కృష్ణ, రోహిత్‌సాగర్, విజయ్, కార్తీక్, రాజేశ్వరి, పూర్ణిమ, అంజలి, విష్ణు, సంధ్య, ఇందిరమ్మలు వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఓబులేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవినీతి కుటుంబపాలనను సాగనంపుదాం



అలంపూర్ రూరల్: రాష్ట్రంలో అవినీతి కుటుంబపాలనను సాగనంపుదామని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా అలంపూర్ మండలంలోని సుల్తానాపూర్, ర్యాలంపాడ్, శింగవరం–1, శింగవరం–2, కాశీపురం గ్రామాలలో యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రజలతో మమేకమవుతూ సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల దొరల పాలనలో పేదలకు ఇళ్లు లేక అవస్థలు పడుతున్నారని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. నిరంకుశ పాలనతో ప్రజలు విసుగుచెందారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నెలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోకారి తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని పెద్దదిన్నెకు చెందిన నర్సింహులు (45) ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబ సభ్యులతో తరచుగా గొడవ పడేవాడు. 20 రోజుల క్రితం మద్యం మత్తులో క్రిమి సంహారక మందును కలిపి తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు కుమారుడు ఉన్నాడు. మృతుని తండ్రి ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు



అమరచింత: పట్టణంలో సీసీ రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని ఐదు, పదో వార్డులో జరుగుతున్న సీసీ రహదారుల పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈమేరకు చైర్‌పర్సన్ మంగమ్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎస్సీ కాలనీలో రూ.50 లక్షలతో సీసీ రహదారులు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా వార్డుల్లో సీసీ రహదారులు, డ్రెయినేజీ నిర్మాణాలకు ఎంత మేరకు ఖర్చు అవుతుందో అన్న విషయాలను కౌన్సిలర్లు, ఏఈతో చర్చించి సరైన అంచనా వేసినట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు సుమారు రూ.4.10 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. ముందు తరాలకు ఉపయోగపడేలా రహదారులు నాణ్యతతో నిర్మించాలని సంబంధిత కాంట్రాక్టర్లకు ఆదేశించామన్నారు. సీసీ రహదారులకు రోజువారి వాటరింగ్ జరుగుతోందా లేదా అన్న విషయాలను కాలనీవాసులు సైతం గమనించి, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత కౌన్సిలర్, సిబ్బందికి తెలియజేయాలని సూచించారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



మానవపాడులో రికార్డులు పరిశీలిస్తున్న దివ్య



మల్లెందొడ్డి కంటి వెలుగు కేంద్రంలో..

మల్దకల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డిలు సూచించారు. శుక్రవారం మండలంలోని మల్లెందొడ్డిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచు వెంటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు ప్రారంభించి మాట్లాడారు. కంటి పరీక్షల నిమిత్తం వచ్చే వారికి వైద్య సిబ్బంది ముందుగా పేర్లు రికార్డులలో నమోదు చేసుకొని వారికి టోకన్లు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, వైస్ ఎంపీపీ పెద్దవీరన్న, డాక్టర్ నవీన్‌కుమార్, స్వరూపరాణి, సర్పంచు వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు మాణిక్యరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చిన్నపోతులపాడులో నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాన్ని శుక్రవారం క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ దివ్య పరిశీలించారు. మొత్తం 131 మందికి కంటి పరీక్షలు, 11మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఏడుగురికి అద్దాల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ యాకుబ్‌బాషా, చంద్రన్న, కార్యదర్శి మంజుల, శ్రావణి, లక్ష్మీనారాయణ, చిట్టెమ్మ, రాణి, పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప విగ్రహాల ప్రతిష్ఠాపన



కలాశంను ఊరేగిస్తున్న భక్తులు

అయిజ: మండలంలోని యాపదిన్నెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం బీరప్ప స్వామి, కనుకదాసు స్వామి విగ్రహాలను వేద పండితులు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గోపుర కలశాన్ని ఊరేగించారు. అనంతరం గోపురంపై కలశ స్థాపన చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున స్వామి, భ్రమరాంభిక దేవి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.